సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 9 । మే । 2025



రమణీయం.. రథోత్సవం

బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనంతో మఠం కిక్కిరిసింది. -10లో



కారును ఢీ కొన్న తుఫాన్

కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రగుంట్లకు చెందిన నంద్యాల నిర్మల (40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.2/26.8

జిల్లాలో గురువారం 26.8 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

మాధవి వివాదాలకు మారుపేరు!

- సీపీ బ్రౌన్ లైబ్రరీ శంకుస్థాపన శిలాఫలకంలో పేర్లపై వివాదం
- నిబంధనలు పాటించాలని సూచిస్తున్నా వినిపించుకోని ఎమ్మెల్యే
- రూ. 6.87 కోట్లు నిధులు మంజూరు చేసిన వైఎస్ జగన్ సర్కార్
- అప్పట్లో సీఎం హోదాలో శంకుస్థాపన చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఆ నిధులకు తిరిగి శంకుస్థాపన చేసినందుకు టీడీపీ ఆరాటం

సాక్షి ప్రతినిధి, కడప: సీపీ బ్రౌన్ గ్రంథాలయం...ఈ పేరు తెలియని వారుండరు. ఓ బ్రిటీష్ అధికారి తెలుగు భాషను కాపాడటానికి చేసిన కృషికి ప్రతిబింబం ఈ గ్రంథాలయం. అలాంటి గ్రంథాలయాన్ని దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోకపోతే, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా అభివృద్ధి చేశారు. యోగివేమన యూనివర్శిటీకి అనుబంధంగా చేర్చారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు గ్రంథాలయ విస్తరణను గాలికొదిలేస్తే.. వైఎస్సార్ సీపీ హయాంలో మరోసారి అభివృద్ధికి అడుగు పడింది. ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్ గ్రంథాలయ విస్తరణకు కంకణం కట్టుకున్నారు. కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ పనులను ముందుకు సాగించి అభివృద్ధి చేయాల్సిన టీడీపీ నేతలు శిలాఫలకాలపై పేర్ల కోసం ఆరాటపడుతున్నారు.

- నా నియోజకవర్గంలో మీ పేర్లేంటి..? తాటికాయంత అక్షరాలతో నా పేరే ఉండాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఎంతో ప్రతిష్టాత్మకమైన సీపీబ్రౌన్ లైబ్రరీ నూతన భవన నిర్మాణ పనులు అలాగే నిలిచిపోయాయి. వాస్తవానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి నిధులు సైతం విడుదల చేశారు. తాజాగా ఈ పనులకు మరో మారు శంకుస్థాపన చేసి తామే చేశామని చెప్పుకునేందుకు టీడీపీ ప్రయత్నం చేస్తోంది. సరే...ఎవరి పేరు ఉంటే ఏముందిలే పనులు సాగితే చాలు అనుకున్నారు భాషా ప్రియులు. కానీ.. ఆ పనులకు సైతం మోకాలడ్డుతుండడం గమనార్హం.



జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత పేరుతో శంకుస్థాపన చేసేందుకు తొలుత సిద్ధం చేసిన శిలాఫలకం



ఎమ్మెల్యే మాధవి అభ్యంతరం తెలపగా ఆమె పేరును పెద్దక్షరాలతో రాయించిన మరో శిలాఫలకం

శిలాఫలకం పేర్ల వద్ద మొదలైన రగడ...

యోగివేమన యూనివర్సిటీ పరిధిలోని ఈ గ్రంథాలయం శంకుస్థాపన విషయంలో పేర్ల వద్ద రగడ మొదలైంది. జిల్లా కేంద్రంలోని సీపీ బ్రౌన్ గంథాలయం నిర్మాణానికి ఇది వరకే సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పట్లో ప్రొటోకాల్ నిబంధనలు ప్రకారం అందరీ పేర్లు అందులో పొందుపర్చారు. మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమైన కూటమి సర్కార్‌లో ఇన్‌చార్జ్ మంత్రి సవిత ద్వారా చేపట్టేందుకు నిర్ణయించారు. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం శిలాఫలకంలో కమలాపురం, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, సి ఆదినారాయణరెడ్డి పేర్లు కూడా ఉన్నాయి. అంతే కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డికి చిర్రెత్తుకొచ్చింది. తన నియోజకవర్గంలో తన పేరు తాటికాయంత అక్షరాలతో ఉండాలి కానీ, వేరే వారు పేరు ఎలా వేస్తారంటూ అగ్గిమీద గుగ్గిలం అయ్యింది. అంతే క్షణాల్లో శిలాఫలకంలో వారి పేర్లు మాయమయ్యాయి. ఎమ్మెల్యే మాధవిరెడ్డి పేరు తాటికాయంత అక్షరాలతో వెలిసింది. ఈ వివాదం కారణంగా 29న జరగాల్సిన రెండవ శంకుస్థాపన కార్యక్రమం వాయిదా పడింది.

అభివృద్ధి పనుల్లో లోపిస్తున్న చిత్తశుద్ధి

జిల్లాలో అభివృద్ధిపై కూటమి ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లోపించిందని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. నిధులు వైఎస్ జగన్ సర్కార్ ఇస్తే కనీసం ఆ పనులను చేపట్టేందుకు కూడా నేతలు సయోధ్య చూపించడం లేదు. ప్రత్యేకించి ఏమి చేయకపోయినా తాటికాయంత అక్షరాలతో పేర్లు మాత్రం నియోజకవర్గం మొత్తం కనిపించాలనే తాపత్రయం కన్పిస్తోంది. మొన్నీ మధ్య వైఎస్ జగన్ సర్కార్ మంజూరు చేసిన వంతెనలనూ తామే చేసినట్లు కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి తన పేరు కోసం తాపత్రయపడ్డారు. ఇప్పుడు ఏకంగా పేరు కోసం లైబ్రరీ నిర్మాణాన్నే అడ్డుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

జగన్ హయాంలో శంకుస్థాపన



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రౌన్ లైబ్రరి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. టెండర్లు పూర్తయ్యాయి. పనులు చేపట్టకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. మళ్లీ శంకుస్థాపన చేసిన తర్వాతే పనులు చేపట్టాలని అధికారులకు అడ్డు తగులుతున్నారు. పైగా తన పేరే ప్రధానంగా కన్పించాలని ఎమ్మెల్యే మాధవీరెడ్డి ముప్పు తిప్పలు పెడుతున్నారు. –ఎం సుబ్బరాయుడు, డివిజన్ ఇన్‌ఛార్జి, ఎర్రముక్కపల్లె

నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు



చంద్రబాబు సర్కార్ నుంచి కొత్తగా నిధులు తీసుకవచ్చింది లేదు. మంజూరైన పనులకు మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు చేసి ప్రచారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. నిధులు తీసుకురాకపోగా, నిస్సిగ్గుగా శిలాఫలకం వేసుకునేందుకు తాపత్రయం పడుతున్నారు. దాంతో బ్రౌన్ లైబ్రరి శంకుస్థాపనకు రెండు శిలాఫలకాలు తయారు చేయించాల్సిన దుస్థితి యూనివర్శిటీ అధికారులకు పట్టింది. –వెల్లాల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ అధ్యక్షుడు

వైఎస్ జగన్ సర్కార్ రూ.6.87కోట్లు మంజూరు

సీపీ బ్రౌన్ లైబ్రరీలో మన చరిత్రకు సజీవ సాక్షాలైన తాళపత్ర గ్రంథాల నుంచి ఎన్నో విలువైన పుస్తకాలున్నాయి. ఇక్కడ తెలుగు భాషా పరిశోధన కేంద్రం కూడా అనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడి కార్యకలాపాలకు ప్రస్తుతం ఉన్న భవనం సరిపోవడం లేదని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన జీఓ నెంబర్ 94/హెచ్ఈ/యూఈ–డీఈపీటీ ద్వారా 2021 జూలై 7న రూ.5.5 కోట్లు నిధులు విడుదల చేశారు. ఆ వెంటనే 2021 జూలై 9న నూతన భవనానికి శంకుస్థాపన కూడా చేశారు. ప్రైవేటు భూమి కొనుగోలు చేసేందుకు, నిర్మాణ ధరలు పెరిగాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మరోమారు తీసుకెళ్లగా జీఓ నెంబర్ 92/హెచ్ఈ/యూఈ–డీఈపీటీ ద్వారా 2023 నవంబర్ 7న రూ.6.874కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పనులను ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వేల్ఫేర్ ఇన్‌ఫ్రా డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. భూమి కొనుగోలు చేసేందుకు రూ.3.11 కోట్లు, నిర్మాణం పనులు చేపట్టేందుకు రూ.3.76 కోట్లు నిధులు డిపాజిట్టు చేసింది. టెండర్లు కూడా పూర్తి అయ్యాయి. పనులు చేపట్టడంలో జాప్యం చేయడం, ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ప్రారంభం కాకుండా నిలిచిపోయాయి.



సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన (ఫైల్)

కాగా వైఎస్ జగన్ సర్కార్ ఏపీఈడబ్ల్యూఐడీసీ సంస్థకు గ్రాంటు డిపాజిట్టు చేసిన ఆ పనులు మొదలు పెట్టేందుకు కూటమి సర్కార్‌లో ప్రజాప్రతినిధులు ఆటంకం కల్గిస్తున్నారు.

SAKSHI
SAKSHI DIGITAL

కలంపై కత్తి



'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేసి, ఆయనతో దురుసుగా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ తీరును జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టులు తీవ్రంగా ఖండిస్తున్నారు. గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి వారు విధులు నిర్వహించారు.

–కడప కార్పొరేషన్

- 'సాక్షి'ఎడిటర్ ఇంటిపై దాడి
- సర్వత్రా వ్యక్తమవుతున్న విమర్శలు

ఎడిటర్ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం



సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు సమాజంలో ఆయన పరువు ప్రతిష్టలకు విఘాతం కలిగించారు. కూటమి ప్రభుత్వంలోని పెద్దల అవినీతి అక్రమాలను వెలికి తీస్తున్నందుకే ఆత్మస్థైరాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారు. దీన్ని ఖండిస్తున్నాం.

– ఎం. బాలక్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే

'సాక్షి'పై కక్షసాధింపునకు ఇది నిదర్శనం



సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేయడం దారుణం. ప్రభుత్వ కక్షసాధింపునకు ఇది నిదర్శనంగా చెప్పవచ్చు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇంట్లోకి ప్రవేశించి, సెర్చ్ వారెంట్ చూపకుండా దురుసుగా ప్రవర్తించడం అన్యాయం. ఇది ఖచ్చితంగా పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నాం.

– పి. రామసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

పత్రికారంగంపై దాడే



అవినీతి అక్రమాలను వెలికి తీయడంతోపాటు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్న పత్రికా రంగంపై దాడి చేయడం దారుణం. ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలిపెట్టు. ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక చర్యలను ఎవరూ ప్రశ్నించకూడదనే నిరంకుశ ధోరణితోనే ఇలా చేసినట్లు భావిస్తున్నాం. – శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే



ఎలాంటి నోటీసులు, సెర్చ్ వారెంట్లు లేకుండా ఎడిటర్ ఇంట్లోకి పోలీసులు చొరబడటం అన్యాయం. పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధంగా ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించారు. ఎడిటర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి, వారి కుటుంబ సభ్యులను భయాందోళనకు గురి చేశారు. ఇది మంచి సాంప్రదాయం కాదు.

– శ్రీనాథరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్

'సాక్షి'ని అణగదొక్కే ప్రక్రియలో భాగమే



సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు తనిఖీలు చేయడం అప్రజాస్వామ్యం. దాదాపు గంటకుపైగా అపార్ట్‌మెంట్‌లో భయానక వాతావరణం సృష్టించారు. గౌరవప్రదమైన పత్రికా ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను చులనక చేయాలనే ఇలా చేశారు. కుట్రపూరితంగా పోలీసులతో దాడి చేయించారు. – వెన్ను శ్రీనివాస్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్. ఏపీయూడబ్ల్యూజే

ఇది కేవలం సాక్షిపై జరిగిన దాడి కాదు



ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక చర్యలను ఎవరు ప్రశ్నించరాదనే నిరంకుశ ధోరణితో కుట్రపూరితంగా ఈ దాడి చేయించారు. ఇది కేవలం సాక్షి ఎడిటర్‌పై మాత్రమే జరిగిన దాడి కాదు. భవిష్యత్తులో మొత్తం మీడియాపై అవే దాడులు, అవే ఆంక్షల కొనసాగే పరిస్థితి ఉంది. మీడియా పరిరక్షణకు రక్షణ కల్పించాలి. – వెంకటరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చిన్నపత్రికల సంఘం

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు తగదు



ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు, ఎడిటర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం లాంటిది. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎడిటర్ ఇంట్లో సోదాలు నిర్వహించడం సరికాదు. ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రశ్నించే గొంతుకలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదు. –ఎం.విజయకుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ముందస్తు సమాచారం లేకుండా సోదాలా!



ముందస్తు సమాచారం లేకుండా సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఇది కచ్చితంగా కక్షసాధింపు చర్యే. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే వాటిని ఖండించడం లేదా పరువు నష్టం దావాలు వేయాలే కాని ఎడిటర్ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేయడం మంచిదికాదు. ఇది పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు. – వీరనాల శివకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

విష సంస్కృతికి చెక్ పడాలి



ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు వంటి విష సంస్కృతికి చెక్ పడాలి. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటివి. రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛ హక్కును కాలరాయాలనుకోవడం సిగ్గుచేటు. –వి.వీరశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రభుత్వం హద్దులు దాటుతోంది



ప్రజాస్వామ్యం అంటూనే నియంత హిట్లర్ రాజ్యాన్ని నడుపుతున్న చంద్రబాబు పత్రికా స్వేచ్ఛపై కత్తిపెట్టడం సరైంది కాదు. వాస్తవాలను ప్రజల దగ్గరికి తీసుకెళ్లే మీడియా వారిపై అధికార దుర్వినియోగం సరైంది కాదు. సుపరిపాలన అంటే వాస్తవాలు చెప్పే వారి గొంతు నొక్కడం కాదు. – గుజ్జుల వలరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

ప్రశ్నిస్తే దాడులు చేయడం సిగ్గు



సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న మీడియాను నొక్కి వేయాలనుకోవడం అంటే ప్రజాస్వామ్యం లేదని చెప్పాలి. నోటీసు లేకుండా ఎడిటర్ ఇంట్లో సోదాలు చేయడం సరికాదు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. పాలకులకు అధికారం ఉంది కదా అని ఎలాగైనా ప్రవర్తిస్తే చట్టం కూడా చూస్తూ ఊరుకోదు.

– హరిత, న్యాయవాది

హేయమైన చర్య



పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలోకి దౌర్జన్యం వెళ్లి సోదాలు నిర్వహించడం అత్యంత హేయమైన చర్య. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సోదాలు చేయడం సబబుగా లేదు. ఇది ప్రజాసామ్యంలో సరైన నిర్ణయం కాదు.

– నాగమునిరెడ్డి, రిటైర్డ్ డిప్యూటి ఈఈ.

న్యూస్‌రీల్

ఆర్‌జేడీ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ జోన్ పరిధిలోని అనంతపురం, చిత్తూరు. కడప, కర్నూలు జిల్లాల్లోని స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్‌2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు సవరించబడిన తుది తాత్కాలిక సీనియారిటి జాబితా https://rjdsekadapa.blogspot.comలో ఉందని పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ తెలిపారు. ఈ విషయమై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో ఈ నెల 10వ తేదీ లోపల అందజేయాలని ఆర్‌జేడీ సూచించారు.

రిమ్స్ సర్వతోముఖాభివృద్ధికి కృషి



డాక్టర్ టి.జమున
రిమ్స్ కొత్త ప్రిన్సిపల్

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) సర్వతోముఖాభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామని అడిషనల్ డీఎంఈ హోదాలో ప్రిన్సిపల్‌గా బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ టి.జమున తెలియజేశారు. ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈమె కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఏ. సురేఖ నంద్యాల ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ అయ్యారు. బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ జమునకు డాక్టర్ ఏ.సురేఖ, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, కాంట్రాక్టర్ బాలనారాయణ రెడ్డి వైద్య సిబ్బంది స్వాగతం పలికారు.

పింఛా ప్రాజెక్టుకు వరదనీరు




సుండుపల్లె: ఇటీవల కురిసిన వర్షాలతో పింఛా ప్రాజెక్టులోకి వరద నీరు చేరింది. గురువారం సాయంత్రానికి 126 క్యూసెక్కుల నీరు వచ్చిందని నీటి పారుదల శాఖ ఏఈఈ నాగేంద్రనాయక్ తెలిపారు. ప్రస్తుతం 987.20 అడుగులు, 124.34 ఎంసీఎఫ్‌టీల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు. ఇన్‌ఫ్లో 126 క్యూసెక్కులు ఉండగా.. లీకేజీలో మూడు క్యూసెక్కులు, కుడికాలువకు 4 క్యూసెక్కులు విడుదల అవుతున్నట్లు వివరించారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- కడప రైల్వేస్టేషన్‌లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ విజయవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



రైల్వేస్టేషన్‌లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌లో భాగంగా స్ట్రెచర్‌పై వ్యక్తిని తరలిస్తున్న పోలీసు సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: అనుకోని ఘటనలు ఏమైనా జరిగినట్లయితే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అన్ని వేళలా సన్నద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా.. అత్యంత జన సంచారం ఉండే కడప రైల్వేస్టేషన్‌లో గురువారం జిల్లా అధికార యంత్రాంగం సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకస్మాత్తుగా ఏదైనా ప్రమాద సంఘటన జరిగితే ప్రజలు ఎలా స్పందించాలో ముందు నుంచే అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ దళాలు ప్రదర్శనలు చేయడం చాలా ఉత్కంఠభరితమైన అనుభూతిని ఇక్కడి ప్రయాణికులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌లో భాగంగా జిల్లాలోని పలు ఉత్పాదక కేంద్రాలైన ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, యూసీఐఎల్ లతో పాటు రైల్వేస్టేషన్లు, విమానాశ్రయం, బస్ స్టాండు లాంటి జనసంచార ప్రదేశాల్లో మాక్ డ్రిల్ ద్వారా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు రక్షణ, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సాధారణ సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహించడం జరుగుతోందన్నారు. రైల్వే స్టేషన్ భవనాలపై ఉగ్రమూకల బాంబులతో దాడులు చేస్తే అక్కడ ఎదురయ్యే పరిస్థితులకు స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేయడం, వెనువెంటనే సంఘటనా స్థలానికి మాస్క్ లు ధరించి చేరుకున్న ఎస్‌డీఆర్ఎఫ్ సహాయక సిబ్బంది ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడడం, నిచ్చెన, రోప్ సాయంతో కొందరిని, మెట్ల మార్గం ద్వారా మరి ప్రమాదంలో గాయపడిన వారిని హుటాహుటిన ప్రమాద స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందించిన తీరు ప్రజల్లో మంచి అవగాహనను పెంపొందించిందన్నారు. అలారం మోగినప్పుడు ఏ విధంగా స్పందించాలో సేఫ్ జోన్ కు ఎలా చేరుకోవాలో సిబ్బంది వివరించారు. జేసీ అదితిసింగ్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఎస్పీ.వెంకటేశ్వర్లు, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, కడప ఫైర్ అధికారి బసివిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ చంద్ర, కడప స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, జీఆర్‌పీ సీఐ సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ నాగరాజు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రుడిని భుజాన మోసుకెళ్తున్న సిబ్బంది

ఆసుపత్రుల సిబ్బందితో మాక్ డ్రిల్

కడప రూరల్: యుద్ధ సమయంలో ప్రజల ఆరోగ్య సంరక్షణ ఎంతో కీలకమైంది....సివిల్ డిఫెన్స్ సన్నద్ధకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు మాక్ డ్రిల్ ను నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని తన చాంబర్లో ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ సంసిద్ధతలో భాగంగా మందులతోపాటు వైద్య సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అత్యవసర, ట్రామా కేర్ కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలన్నారు. అలాగే స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రి సిబ్బందితో మార్క్ డ్రిల్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నివారణ అధికారి డాక్టర్ రవి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రమేష్, డెమో రమణమ్మ, ఖాజా, కుమారి తదితరులు పాల్గొన్నారు.



సివిల్ డిఫెన్స్ సన్నద్ధతపై ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ

క్లుప్తంగా

'బంగారు గొలుసు లాక్కెళ్లారు'

తొండూరు : మండలంలోని మడూరు – దొండ్లవాగు గ్రామాల మధ్యలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎం బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లినట్లు ఎస్ఐ ఘనమద్దిలేటి తెలిపారు. గురువారం మడూరు ఏఎన్ఎంగా పనిచేస్తున్న దీవెనమ్మ మడూరులో వైద్య సేవలు అందించి దొండ్లవాగుకు వెళుతుండగా మార్గమధ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో సింగపూర్ టౌన్‌షిప్ సమీపంలో నడిచి వెళుతున్న కాంచనమ్మ అనే మహిళ మెడలో నుంచి సుమారు రెండు తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం మోటార్‌సైకిల్‌పై వచ్చి లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని సంకేపల్లె గ్రామానికి చెందిన వివాహిత మహిళ అదృశ్యం అయినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ బాసు గురువారం తెలిపారు. మండలంలోని సంకేపల్లె గ్రామానికి చెందిన దాతపురం కొండయ్య భార్య బుధవారం ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గర్భం దాల్చిన పదో తరగతి విద్యార్థిని

మదనపల్లె రూరల్ : ప్రేమ పేరుతో నయవంచనకు గురైన పదో తరగతి విద్యార్థిని గర్భం దాల్చింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని(15) తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా, కుటుంబ సభ్యులు బుధవారం అర్ధరాత్రి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు చికిత్స అందించే లోపు ఆమెకు గర్భస్రావం అయింది. ఈ విషయాన్ని గుర్తించిన వైద్యులు వెంటనే అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆస్పత్రికి చేరుకున్న టూటౌన్ పోలీసులు బాధితురాలితో మాట్లాడి, కేసు నమోదుచేస్తే న్యాయం చేస్తామని చెప్పినా వినిపించుకోలేదు. ఈ విషయం బయటకు పొక్కితే తాము ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందంటూ విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స తీసుకోకుండానే వెళ్లిపోయినట్లు తెలిసింది.

యువకుడిపై కత్తితో దాడి

సుండుపల్లె : సురేష్‌బాబు అనే యువకుడిపై ఫారుక్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. బాధితుని వివరాల మేరకు.. మండల కేంద్రంలోని పీలేరు రోడ్డులో ఫ్రైవుడ్ దుకాణం నిర్వహిస్తున్న సురేష్‌బాబు బుధవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సర్కిల్‌లోని ఓ సెల్‌పాయింట్ వద్ద ఉండగా ఫారుక్ అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

500 లీటర్ల సారా ఊట ధ్వంసం

మదనపల్లె రూరల్ : మండలంలోని నారమాకులతాండాలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామ సరిహద్దుల్లో 500 లీటర్ల సారా ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ నారమాకులతాండాలో గతంలో అత్యధికంగా సారా విక్రయాలు ఉండటంతో ఈ ప్రాంతంలో తరచూ దాడులు నిర్వహిస్తున్నామన్నారు. అక్రమంగా సారా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రమణీయం.. రథోత్సవం

- భక్తజన సంద్రంగా బ్రహ్మంగారిమఠం
- కమనీయంగా ఆరాధనోత్సవాలు
- మార్మోగిన 'వీరబ్రహ్మ' నామస్మరణ



రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తజనం



మఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



రథానికి పూజలు చేస్తున్న పూర్వపు మఠాధిపతి కుమారులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో గురువారం బ్రహ్మరథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనంతో మఠం కిక్కిరిసింది. జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఐదో రోజున ఉదయం గుడి ఉత్సవం కమనీయంగా జరిగింది. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను పీఠంపై ఆశీనులను చేసి, ఊరేగింపు చేశారు. ఈ ఉత్సవానికి ప్రకాశం జిల్లా చీరాలలోని విశ్వబ్రాహ్మ ఇండస్ట్రీస్‌కు చెందిన తుర్లపాటి సాంబశివారావు, ఆయన సతీమణి పద్మావతి ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం మహా నైవేద్య కార్యక్రమం నిర్వహించారు.

రథానికి ప్రత్యేక పూజలు

సాయంత్రం బ్రహ్మరథోత్సవం కమనీయంగా నిర్వహించారు. ముందుగా రథానికి మఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, వరదరాజస్వామితోపాటు కుటుంబ సభ్యులు, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి, మఠం పెద్దాచార్యులు భద్రయ్యస్వామి, దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజి, ఆర్డీఓ చంద్రమోహన్, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరకిశోర్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ డీసీ గురుప్రసాద్, ఏసీ మల్లికార్జున, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ ఎత్తపు సుదర్శన్ రెడ్డి, టీడీపీ నాయకులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కానాల మల్లికార్జున్‌రెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ పూజారులు వేద మంత్రోచ్చారణ గావించారు. అనంతరం రథాన్ని కదిలించారు. 'వీరబ్రహ్మ జై గోవిందమాంబ జై'.. అంటూ భక్తులు రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవం మాఢ వీధుల మీదుగా ఉత్సాహ భరితంగా సాగింది. 'వీరబ్రహ్మ'నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. జిల్లా నలుమూలల ఉంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తజనం తరలివచ్చారు. వీరితో మాఢవీధులు కిటకిటలాడాయి. వారు రథోత్సవాన్ని కనులారా వీక్షించి ఆనంద భరితులయ్యారు. రథం పుర వీధులో తిరిగిన తర్వాత యథా స్థానానికి చేరుకుంది. అంతకుముందు బ్రహ్మరథ నిర్మాతలు వంకమర్రి వెంకటరెడ్డి, పునఃనిర్మాణ దాతలు బూదగిరికి చెందిన రాజగోపాలాచార్యులు, రథోత్సవ తాత్కాలిక ఉభయ దాతలు కడపకు చెందిన మునగా బద్రినారాయణ, సునీత దంపతులు, అలంకరణ దాతలు కర్నూలు కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న నందిని స్వీట్స్ బేకరికి చెందిన రేవల్లి కన్నా సోదరులకు ఘన సన్మానం చేశారు.

ఆకట్టుకున్న గజవాహనోత్సవం

రాత్రి నిర్వహించిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది. అనంతరం గజవాహనోత్సవం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గజ వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. తిరిగి ఊరేగింపు పెద్దమఠం చేరుకుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గం సంకటితిమ్మాయపల్లెకు చెందిన పోలు పాలేటమ్మ, సుబ్బిరెడ్డి, బాలహుసేన్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. అన్నదానాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలను దాతలు విరివిగా చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిబ్బంది, స్వామి శిష్యులు ఏర్పాట్లు చేపట్టారు.

భారీ బందోబస్తు

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ సీఐలు రమణారెడ్డి, శివశంకర్ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. జిల్లా నుంచి పలువురు సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలతోపాటు 400 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు.

వెల్లాల బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వెల్లాలలో పుట్ట మట్టి కోసం వెళుతున్న వేద పండితులు

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే స్వాముల వారికి అభిషేకం, సహస్ర నామార్చన, ఆకుపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి పూజలు చేశారు. అంకురార్పణం, ధ్వజారోహణం అనే కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. భక్తులు స్వాములను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణంలో లైటింగ్, చలువ పందిళ్లు వేయడంతో పండుగ కళ వచ్చినట్లయింది. కార్యక్రమంలో ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవుని కల్యాణం : వెల్లాలలోని సంజీవరాయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వాముల కల్యాణం శుక్రవారం జరగనుంది. కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు రావాలని, అలాగే రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి విగ్రహాలను పల్లకీపై ఊరేగించనున్నట్లు ఈఓ తెలిపారు.

• గాలి వాన బీభత్సం



గాలివానకు నేల రాలిన మామిడి కాయలు



విరిగి పడిన మామిడి చెట్లు

చక్రాయపేట : మండలంలోని కె.ఎర్రగుడి, కల్లూరుపల్లె గ్రామాల్లో గురువారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిగిపడగా మరి కొన్ని చెట్లు వేర్లతో సహా లేచి పడ్డాయి. కాయలు కూడా రాలిపోయాయని జగదీశ్వరరెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు వంద ఎకరాల్లో నష్టం జరిగి ఉంటుందని ఆయన వివరించారు. కాయలు కోతకు వస్తున్న సమయంలో విపరీతమైన గాలి వచ్చి రైతులను తీవ్ర నష్టాలకు గురి చేసిందని వాపోయారు. నష్టపోయిన తమను ఆదుకోవాలని మామిడి రైతులు వేడుకుంటున్నారు.

కారును ఢీకొన్న తుఫాన్ వాహనం



మృతి చెందిన నిర్మల



నుజ్జు నుజ్జు అయిన కారు

- మహిళ మృతి
- నలుగురికి గాయాలు

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రగుంట్లకు చెందిన నంద్యాల నిర్మల (40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ విద్యా సాగర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రగుంట్ల పట్టణం క్రాంతి నగర్‌కు చెందిన బ్రహ్మానందరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి కారులో కడప నుంచి ఎర్రగుంట్లకు వెళ్తుండగా మార్గ మధ్యంలో కమలాపురం మండలం పందిళ్లపల్లె సమీపంలోనికి రాగానే ఎర్రగుంట్ల నుంచి కడప వైపు వెళ్లే తుఫాన్ వాహనం ప్రమాదవశాత్తు ఢీ కొంది. ఈ ఘటనలో బ్రహ్మానందరెడ్డి భార్య నిర్మల అక్కడికక్కడే మృతి చెందారు. బ్రహ్మానందరెడ్డితో పాటు వారి ఇద్దరు పిల్లలు, తుఫాన్ డ్రైవర్ అయిన చెప్పలి నరసింహులుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ విద్యాసాగర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిర్మల మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ప్రొద్దుటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి గురైన బైక్‌లు స్వాధీనం



బైకుల స్వాధీనం వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జమ్మలమడుగు రూరల్ : ద్విచక్ర వాహనదారులు తమ బైక్‌లను ఎక్కడపడితే అక్కడ పెట్టకుండా వాహనాలకు రక్షణ ఉండే చోట పెట్టుకోవాలని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ లింగప్పతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొంత కాలం నుంచి పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ చేసి ఉన్న మోటార్ బైక్‌లు అలాగే ప్రొద్దుటూరు ప్రాంతంలో వివిధ స్థలాల్లో పార్కింగ్ చేసిన సుమారు 16 మోటారు బైక్‌లు చోరీకి గురయ్యాయన్నారు. గత నెల 26వ తేది జమ్మలమడుగు మండలంలోని ఎస్.కొట్టాల గ్రామానికి చెందిన బొందల సుధీర్ అనే వ్యక్తి కడపకు వెళుతూ తన బైక్‌ను రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ చేసి వెళ్లాడన్నారు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. గురువారం బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి పారిపోతుండగా పట్టుకొని విచారించగా నంద్యాల జిల్లా చాగలమర్రి (పెద్ద మకాన్) గ్రామానికి చెందిన ముత్యాలపాటి దాదావలీగా గుర్తించారు. గత కొంత కాలంగా 16 బైక్‌లను చోరీ చేసి వాటిలో రెండు బైక్‌లను విడి భాగాలుగా చేసి విక్రయించినట్లు తెలిసిందన్నారు. వీటి విలువ సుమారు రూ. 10 లక్షలు అవుతుందని ఆయన తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. మోటార్ బైక్‌లను రికవరీ చేసిన సీఐ లింగప్ప, ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది రియాజ్, దేవదాసు, నాగేంద్రలను డీఎస్పీ అభినందించారు.

మృత్యుశకటమైన ఆర్టీసీ బస్సు



నరసింహులు (ఫైల్)

బద్వేలు అర్బన్ : స్వగ్రామం నుంచి పట్టణానికి ఓ పని నిమిత్తం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన ఆ వ్యక్తికి తాను ప్రయాణించిన బస్సే తన పాలిట మృత్యుశకటమవుతుందని ఊహించలేదు. గురువారం బద్వేలు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో జరిగిన ప్రమాదంలో ఓ విశ్రాంత ఉద్యోగి మృతి చెందారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. పోరుమామిళ్ల మండలం గానుగపెంట గ్రామానికి చెందిన గంధంశెట్టి నరసింహులు (69) ఇరిగేషన్‌శాఖలో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. ఈయనకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. నరసింహులు ఓ పని నిమిత్తం గురువారం ఉదయం బద్వేలు – చల్లగిరిగెల – క్రిష్ణంపల్లె ఆర్టీసీ బస్సులో బద్వేలు బస్టాండులో దిగారు. బస్టాండు నుంచి పోస్టాఫీసు వద్దకు వెళ్లేందుకు నడుచుకుంటూ వస్తుండగా డిపో నుంచి తిరిగి బయలుదేరిన బస్సు బస్టాండు సమీపంలోని సిద్దవటం రోడ్డులో నరసింహులును ఢీకొట్టింది. దీంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ సురేంద్ర కేసు నమోదు చేశారు.

కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి

- పోలీసులు, కార్మికుల మధ్య తీవ్ర తోపులాట
- ఇద్దరికి గాయాలు



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు, పోలీసుల మధ్య తోపులాట దృశ్యం

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కడప నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు ఎస్. కిరణ్, నగర కార్యదర్శి సుబ్బయ్య, చంద్రారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు 60 ఏళ్ల వయసు వచ్చిందని చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా రిటైర్‌మెంట్ చేయడం దారుణమన్నారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి, రూ.10 లక్షలు బెనిఫిట్లు, రూ.10వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్మికులు బారికేడ్లను తోసుకుంటూ కార్యాలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ దశలో పోలీసులు, కార్మిక నాయకుల మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. తోపులాటలో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా కమిషనర్ మనోజ్‌రెడ్డి దీక్షా శిబిరం వద్దకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. రిటైర్ అయ్యే కార్మికుల కుటుంబంలో ఒకరికి అడిషనల్ వర్కర్‌గా ఉద్యోగం కల్పిస్తామని స్టాండింగ్ కమిటీలో తీర్మానం చేశారన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలిచ్చే విషయమై మేయర్‌తో మాట్లాడతామన్నారు. మిగిలిన సమస్యలపై ఈనెల 9వ తేదీ కార్మికులతో కూర్చొని చర్చిస్తామన్నారు. దీక్ష చేస్తున్న వారికి మజ్జిగ ఇచ్చి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె. తిరుపాల్, నగర అధ్యక్షుడు ఎస్. రవి, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీరామ్, ఇ. ప్రకాష్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీధర్ బాబు, నాగరాజు, మస్తాన్, శీను, రాజు, హరి, పెంచలయ్య, నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



నాదెండ్ల అన్వర్(ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామానికి చెందిన నాదెండ్ల చిన్న ఇమాములు, మస్తానమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు నాదెండ్ల అన్వర్ (20) గురువారం ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాదెండ్ల అన్వర్ చిత్తూరు జిల్లాలోని పుత్తూరులో ఇంజినీరింగ్ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. సెలవులు కావడంతో సరదాగా స్నేహితులతో కలిసి పులివెందుల మండల పరిధిలోని రాయలాపురం గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఉన్న కుంట వద్దకు ఈతకు వెళ్లాడు. అక్కడ అన్వర్ ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు 20 ఏళ్లకే నూరేళ్లు నిండాయా అంటూ అన్వర్ మృతదేహం వద్ద బోరున విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ అధికారి సస్పెన్షన్?

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆర్టీసీ కడప జోన్ పరిధిలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆయనపై ఇటీవల విచారణ చేపట్టారు. ఆయనను సస్పెండ్ చేసి ఆయన స్థానంలో నెల్లూరు విజిలెన్స్ విజిలెన్స్ అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిసింది. అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

సుగవాసికి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు



పాలకొండ్రాయుడు అంత్యక్రియల్లో గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



పాలకొండ్రాయుడు భౌతికకాయం వద్ద ఆయన కుమారులు సుబ్రమణ్యం, ప్రసాద్‌బాబు

రాయచోటి : రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే, రాజకీయ దిగ్గజం సుగవాసి పాలకొండ్రాయుడు పార్థివదేహానికి ప్రభుత్వం తరపున అధికారిక లాంఛనాలతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రిని కడసారి చూసి కుమార్తె, కుమారులు, అభిమానులు కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. వేలాదిగా తరలివచ్చిన జనం 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. రాయచోటి పెద్దాయనగా పిలుచుకునే పాలకొండ్రాయుడును కడసారిగా చూసేందుకు నియోజకవర్గంలోని ప్రజలతో పాటు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, వైఎస్ఆర్, అనంతపురం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు.

అంతిమయాత్ర

వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకపు అశ్రునయనాల మధ్య సీనియర్ రాజకీయ నేత మాజీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు అంతిమయాత్ర సాగింది. గాలివీడు మార్గంలోని ఆయన స్వగృహం (ప్రీతమ్ రెసిడెన్సీ) నుంచి గురువారం ఉదయం 9.30 గంటలకు అంతిమయాత్ర ప్రారంభమైంది. కదిరి రోడ్డు, హరినాథవీధి, ఆర్టీసీ బస్టాండ్, నేతాజీ సర్కిల్, ఠాణా, బండ్లపెంట, మాసాపేట, మునెప్పగారిపల్లె, పాతరాయచోటి మీదుగా గాలివీడు మార్గంలోని ప్రసాద్ థియేటర్ వరకు సాగింది. అంతిమయాత్రలో అభిమానులు, కార్యకర్తలు జోహార్ రాయుడు అంటూ నినాదాలు చేస్తూ భాగస్వాములయ్యారు. వారి మధ్యన పెద్దాయన పార్థివదేహంతో ప్రత్యేక వాహనం కదిలింది. ప్రత్యేక వాహనంలో ఆయన ఇద్దరు కుమారులు సుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులు ఇరువైపులా నిల్చున్నారు.